క్లుప్తంగా

పన్ను వసూళ్లపై దృష్టిపెట్టాలి

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): గ్రామాల్లో ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని డీఎల్‌పీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎల్‌పీవో మాట్లాడుతూ.. గ్రామాలు అభివృద్ధిలో ఉండాలంటే వందశాతం పన్నులను వసూలు చేయాలన్నారు. అవసరమైతే పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించాలన్నారు.

ప్రజాపాలన సేవాకేంద్రం ప్రారంభం



ధర్పల్లి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజా పాలన సేవా కేంద్రాన్ని ఎంపీవో రాజేష్ ప్రారంభించారు. 6 గ్యారంటీలకు కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీవో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులు ప్రతిరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వీకరిస్తామని అధికారులు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ అసిస్టెంట్ గంగాధర్, జూనియర్ అసిస్టెంట్లు హరీష్ ,సుధాకర్, విజయ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల తనిఖీ



నిజామాబాద్‌అర్బన్: నగరంలో ప్రభుత్వ పాఠశాలలను సోమవారం డీఈవో దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. కసాబ్‌గల్లి బాలికల ఉన్నత పాఠశాల, ఖిల్లాలోని ఉన్నత పాఠశాలలో ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, బాగా చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అలాగే పరీక్షల నిర్వహణ, విద్యా బోధనకు సంబంధించి టీచర్లను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం సాయారెడ్డి, గంగాధర్ పాల్గొన్నారు.

'వైభవరత్న' రామకృష్ణశర్మ



నిజామాబాద్ సిటీ: నగరంలోని సీతారాంనగర్‌కు చెందిన బ్రహ్మశ్రీ వేలేటి రామకృష్ణ శర్మ పురోహిత వైభవరత్న బిరుదు అందుకున్నారు. సర్ సీవీ రామన్ అకాడమీ హైదరబాద్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అయారంగల్లో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి ఉగాది పురస్కారాలు, అవార్డులు ప్రదానం చేస్తారు. ఈమేరకు ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటులు కాదంబరి కిరణ్, జెన్నీ, శ్రీ కష్ణ చాముండేశ్వరి చేతుల మీదుగా రామకష్ణ శర్మ పురోహిత వైభవరత్న బిరుదుతో పాటు సువర్ణ కంకణం, గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రం అందుకున్నారు. అనంతరం రామకృష్ణ శర్మను సన్మానించారు.

నియామకం

వర్ని: మండల బీజేపీ అధ్యక్షుడిగా జలాల్పూర్ గ్రామానికి చెందిన ఇల్తేమ్ శంకర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నియామకపు ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు శంకర్‌కు అందజేశారు. అలాగే చందూరు మండల అధ్యక్షుడిగా మదిశెట్టి విఠల్, మోస్రా అధ్యక్షుడిగా సంఘ అనిల్‌లను నియమించారు.

పుస్తకావిష్కరణ

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రం చరిత్ర ఆధారంగా స్థానిక రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు నర్సింగ్ రావు రచించిన అల్లకొండ ఊరు ఉద్భవం- ఐదు ఆలయాలకు ప్రసిద్ధి అనే పుస్తకాన్ని ఆదివారం హైదారాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ చంద్రయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. బాల్కొండ ఖిల్లా, దవాలను చరిత్రను ఆధారంగా చేసుకుని పుస్తకాన్ని రచించారు. భావితరాలకు చరిత్రను అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

మాశెట్టి నర్సయ్యకు అవార్డు

బోధన్ టౌన్(బోధన్): బోధన్‌కు చెందిన వ్యాపార వేత్త, సామాజిక కార్యకర్త, సంఘ సేవకులు మాశెట్టి నర్సయ్యను మరో అవార్డు వరించింది. బోధన్ పట్టణంతో పాటు వివిధ మండలాల్లో, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవాలో, చక్రేశ్వర ఆలయ పాలక వర్గంలో ఆయన చేసిన సేవలను గుర్తించి సేవ్ సీవీరామన్ సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. మాశెట్టికి ఈ అవార్డు వరించడంతో వ్యాపారస్తులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఇంకెన్నాళ్లు చేయిస్తరు?

- మున్సిపల్ కార్పొరేషన్‌లో రిటైర్డ్ ఉద్యోగులకు విధులు
- ఏళ్ల తరబడిగా కొనసాగుతున్న వైనం
- ఇటీవల జీహెచ్‌ఎంసీలో పలువురి తొలగింపు
- స్పందించని అధికారులు

నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలువురు రిటైర్డ్ ఉద్యోగులు ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నారు. వీరి స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించాల్సి ఉన్నా అధికారులు మౌనం పాటించడంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్ జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులను తొలగించారు. మరీ ఇక్కడ ఇంకెప్పుడు తొలగిస్తారో!



నిజామాబాద్‌నాగారం: గత ప్రభుత్వ హాయంలో నగర మున్సిపల్ కార్పొరేషన్‌లో రిటైర్డు ఉద్యోగులదే పైచేయ్యి అని, వారు చెప్పినట్లు అంతా జరుగుతుందని ఆయా సెక్షన్‌లోని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ప్రజాప్రతినిధులైనా, అధికారులైనా రిటైర్డు ఉద్యోగులు చెప్పిందే వినాలి. వారు సూచించిన వారికే పనులు, బిల్లులు.. ఇలా ఏదైనా సరే అంతా వారి కనుసన్నుల్లోనే జరిగింది. ఇంత జరుగుతున్నా వారిని తొలగించడానికి ఎవరూ సాహసించడం లేదు.

ప్రభుత్వం మారినా అంతే..

గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు రిటైర్డు ఉద్యోగులకు అందలం ఎక్కించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీటిపై సీరీయస్‌గా స్పందించి, రాష్ట్రస్థాయిలోని అన్ని శాఖల్లో రిటైర్డు ఉద్యోగులను తొలగించారు. ఇటీవల జీహెచ్‌ఎంసీలో రిటైర్డు ఉద్యోగులు సుమారు 37మంది ఉంటే వారిని తొలగించారు. నిజామాబాద్ మున్సిపాలిటీలో మాత్రం రిటైర్డు ఉద్యోగులను తొలగించడంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. దీంతో వారు పనులు చేయకున్నా హాయిగా పెన్షన్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ విధానంలో ప్రతి నెల జీతాలు తీసుకుంటూనే ఉన్నారు. రిటైర్డు ఉద్యోగుల స్థానంలో నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని ఎంతో మంది కోరుతున్నారు. పెన్షన్ వచ్చేవారికి ఉద్యోగాలు ఇవ్వడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా అధికారులు మౌనం పాటించడంపై పలు అనుమానాలకు తావిస్తుంది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాలి మరీ..!

ఆ ముగ్గురు..

నగర కార్పొరేషన్‌లో ఓ వ్యక్తి ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా పదోన్నతులు పొంది చివరకు సుమారు ఐదేళ్ల క్రితం పదవీ విరమణ చేశారు. అనంతరం ఆ అధికారికి అప్పటి ప్రజాప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉండడంతో నాలుగేళ్లుగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఇంజినీరింగ్ సెక్షన్‌లో రిటైర్డు అయినా కొనసాగుతున్నారు. ఈయన స్థానంలో కొత్త ఉద్యోగులను నియమించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఇప్పటికీ ఆ అధికారి కనుసన్నుల్లోనే ఇంజనీరింగ్ వ్యవస్థ నడుస్తోందని ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు మరో ఇద్దరు సైతం ఇదే సెక్షన్‌లో కొనసాగుతున్నారు. వీరికి ప్రతి నెల సుమారు రూ. 1లక్ష వరకు మున్సిపాలిటీ నుంచి జీతాలు చెల్లిస్తున్నారు. వీరికి వచ్చే పెన్షన్‌లో సగం జీతం రూపంలో చెల్లిస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేసే ఉద్యోగికి సుమారు రూ. 16వేల జీతం ఇస్తున్నారు. ఈ లెక్కాన వీరి జీతాలతో సుమారు ఆరుగురికి ఔట్‌సోర్సింగ్ విధానంలో జీతాలు చెల్లించవచ్చు.

నేటి చిత్రం..



పాత కలెక్టరేట్ వద్ద మూలనపడిఉన్న వైకుంఠ రథం

ప్రచారం లేక నిరుపయోగంగా..

నిజామాబాద్ నగరంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని ఉచితంగా శ్మశాన వాటికకు తీసుకెళ్లడానికి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని కొనుగోలు చేశారు. కానీ అది ప్రజలకు తెలియకపోవడంతో ఇలా నిరుపయోగంగా ఉంది. ప్రధాన ప్రాంతాల్లో, శ్మశాన వాటికల వద్ద నగర పాలక సంస్థ వైకుంఠ రథం ఉందంటూ సెల్‌ఫోన్‌నెంబర్ పెట్టాలని దీని ద్వారా ప్రజలకు తెలుస్తుందని పలువురు కోరుతున్నారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్‌నాగారం: నియోజకవర్గంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఆయన చెక్కుల పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డ పెళ్లి కుటుంబానికి భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా సబ్ కా సాత్ సాబ్ కా వికాస్ అనే లక్ష్యంతో పని చేస్తుందన్నారు. మైనారిటీల అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కూమర్ గౌడ్, మేయర్ నీతూకిరణ్, బీజేపీ మున్సిపల్ డీప్యూటీ ఫ్లోర్ లీడర్ న్యాలం రాజు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు మాస్టర్ శంకర్, బైకన్ మధు, ఖైజార్ చౌష్, ఆనంద్, పవన్, సందీప్, స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

నిజామాబాద్‌నాగారం: బీఆర్ఎస్ 17వ డివిజన్ కార్పొరేటర్ సబితారాజ్, 37వ డివిజన్ కార్పొరేటర్ ఉమారాణి ముత్యాలు, 40వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మాయావారి సాయిరాం, మాయవార్ సంతోషలు సోమవారం బీజేపీలో చేరారు. వారికి నగరంలోని బీజేపీ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పార్టీ కండువాలు కప్పి, బీజేపీలోకి ఆహ్వానించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, నాగోళ్ళ లక్ష్మీనారాయణ, స్రవంతి రెడ్డి, బైకన్ మధు, నీచంగ్ కృష్ణ, ఆకుల శ్రీనివాస్, గడ్డం రాజు పాల్గొన్నారు.



నాయకులను బీజేపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

నిబంధనల ప్రకారం పనులు చేయించాలి

నిజామాబాద్‌నాగారం: భవన నిర్మాణ కార్మికులతో నిబంధనల ప్రకారమే పనులు చేయించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్లెడి గంగారెడ్డి తెలిపారు. కొంత మంది బిల్డర్లు వలస కార్మికులను తీసుకొచ్చి నిబంధనలకు విరుద్ధంగా పనులు చేయిస్తున్నారన్నారు. ఈమేరకు సోమవారం సంఘం ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. నిబంధనలు పాటించని వారిపై కలెక్టర్, లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సంఘ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నీలకంఠేశ్వరాలయంలో మహా శివరాత్రి ఏర్పాట్లు



నిజామాబాద్ సిటీ: ఈ నెలా 8న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా నగరంలోని నీలకంఠేశ్వర ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తుల క్యూలైన్ల పనులను సోమవారం ప్రారంభించారు. ఆలయ ఈవో వేణు పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. క్యూ లైన్లలో లైటింగ్ ఏర్పాట్లు, అలాగే భక్తులకు తాగునీటి వసతి కల్పించనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తం

చలివేంద్రం ప్రారంభం



ధర్పల్లి: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం మణికంఠ వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. నిర్వాహకులు సబ్బాని గిరిధర్, చాట్ల ప్రణీత్, లింబాద్రి, సందీప్, రామకృష్ణ, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



ధర్పల్లి: సమాజంలో ఉన్నత స్థానం సంపాదించాలంటే విద్యార్థులు కష్టపడి చదవాలని హైదరాబాద్ రంజి క్రికెట్ ప్లేయర్ నాగేంద్ర అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే అది సాధించే వరకు విశ్రమించకుండా కష్టపడాలని సూచించారు. పాఠశాల సిబ్బంది ఆయనను సత్కరించారు. హెచ్‌ఎం జ్యోతిరాణి, టీచర్లు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

జక్రాన్‌పల్లి: బోధన్ బీసీ హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థి వెంకట్‌ను ఇంటర్ విద్యార్థులు హత్య చేయడం శోచనీయమని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మోహన్‌నాయక్ చౌహాన్ ఒక ప్రకటనలో అన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. హత్య ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ ఘటనకు బాధ్యుడైన హాస్టల్ వార్డెన్‌పై చర్యలు చేపట్టాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఆదుకోవాలన్నారు.

విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ల పంపిణీ



నిజామాబాద్‌రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చైతన్య సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, పరీక్ష ప్యాడ్‌లను రూరల్ ఎస్‌హెచ్‌వో మహేష్ వితరణ చేశారు. ఎస్సెస్సీ, ఇంటర్‌లో 8 నుంచి 9.5 జీపీఏ సాధించిన వారికి రూ. 3వేల నుంచి రూ.5వేల వరకు పారితోషికం అందజేస్తానని ఎస్‌హెచ్‌వో అన్నారు. సొసైటీ ప్రతినిధులు కోయేడి నరసింహులు, హెచ్ ఎం రమాదేవి, శ్రీనివాస్, కిషన్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి మండలంలో..

నిజామాబాద్‌రూరల్(డిచ్‌పల్లి): మండలంలోని సుద్దపల్లి గ్రామంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన వస్తువులు పెన్నులు, పెన్సిళ్లను గ్రామానికి చెందిన నరేష్ అందజేశారు. వీడీసీ సభ్యులు ఎంబడి సుబ్బయ్య, పావురాజు సందీప్,సాగర్, నరహరి, పవన్ గ్రామస్తులు ఉన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



నిజామాబాద్‌రూరల్: నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారుల ఆధ్వర్యంలో సంఘం జిల్లా డైరీ, క్యాలెండర్‌ను జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు ఆవిష్కరించారు. జెడ్పీ సీఈవో ఉష, డిప్యూటీ సీఈవో సుందర వరదరాజన్, ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఎంపీడీవోలు క్రాంతి, సంతోష్, ఆనందరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇందల్వాయి: మండలంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో ఈనెల 22లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

సిరికొండ: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈనెల 11 వరకు ప్రభుత్వం పొడిగించినట్లు ప్రిన్సిపాల్ సునీత ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో పూర్తి సీట్లకు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఉన్న ఖాళీ సీట్లకు ఈ నెల 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశ పరీక్ష వచ్చే నెల ఏడో తేదీన ఉంటుందని తెలిపారు.

దాతలకు సన్మానం



నిజామాబాద్ సిటీ: నగరంలోని భక్త మార్కండేయ స్వామి ఆలయానికి విరాళాలు అందజేసిన దాతలను సోమవారం ఆలయంలో ఘనంగా సన్మానించారు. నగర పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దాతలను సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. సంఘ ప్రతినిధులు గుజ్జేటి వెంకట నర్సయ్య, బింగి మోహన్, మద్ద అబ్బన్న, సిద్దిరాములు ఉన్నారు.

ముగిసిన సంత్ రవిదాస్ జయంతి వేడుకలు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని న్యూ అంబేడ్కర్ భవన్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బిఆర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం సంత్ రవిదాస్ జయంతి ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ హాజరై, మాట్లాడారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు సర్టిఫికెట్లను అందజేశారు. నాయకులు ప్రవీణ్, సందీప్, కుమార్, సాయి, సంజీవ్, రాజు ఉన్నారు.

పాలాభిషేకం

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశా రు. ఆరు గ్యారంటీలలో భాగంగా 200 యూని ట్లలోపు ఉచిత బిల్లు, రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, జిల్లా నాయకులు దేగాం గంగారెడ్డి, పెంట ఇంద్రుడు, మోర్తాడ్ బోజారెడ్డి, దేవిదాస్, వైఎస్ గంగాధర్ పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్‌కు సన్మానం



బాల్కొండ/నందిపేట: తెలంగాణ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్‌ను సోమవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, బాల్కొండ, మెండోరా, కమ్మర్‌పల్లి మండలాల అధ్యక్షులు వెంకటేష్, ముత్యంరెడ్డి, సుంకెట రవి, నందిపేట నాయకులు దేగాం గంగారెడ్డి, పిప్పెర సాయరెడ్డి, పెంట ఇంద్రుడులు ఉన్నారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

బోధన్‌రూరల్(బోధన్): పెంటాకలాన్ సొసైటీ చుట్టూ ఏర్పాటు చేస్తున్న ప్రహరీ నిర్మాణ పనులకు సొసైటీ అధ్యక్షుడు దొనకంటి రాజారెడ్డి భూమిపూజ చేసి ప్రారంభించారు. రూ.10లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. సొసైటీ డైరెక్టర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

సొసైటీ సీఈవో పదవీ విరమణ

బోధన్ రూరల్: పెంటాకుర్దు సొసైటీ కార్యదర్శి పోతారెడ్డి సోమవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పోతారెడ్డి దంప తులనును సొసైటీ చైర్మన్ అమర్నాథ్ బాబు, సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి సీఈవోగా రావుఫ్‌ను నియమిస్తున్నట్లు అసిస్టెంట్ రిజిస్ట్రార్ రవీంద్రబాబు వెల్లడించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	64,500	వెండి (కిలో)	75,000
22 క్యారెట్స్	59,477		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	45	60
బెండకాయ	50	70	పచ్చిమిర్చి	40	70
బీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
జిల్నెనుకాయ	30	60	గోబిగడ్డ	30	50
కాకరకాయ	50	70	గోబిపువ్వు	50	70
వంకాయ	45	65	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	50	70
మెంతికూర	20	40	చామగడ్డ	60	80
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	50	70
పుదీనా	35	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	వ్యూహం (తెలుగు) - 10.55 ఊరు పేరు భైరవ కోన - 01.30, సమరసింహా రెడ్డి - 4.30, ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 7.30, 10.30
స్క్రీన్-2	చారి-111 (తెలుగు) - 11.00, 1.40, హనుమాన్ - 04.30 వ్యూహం - 07.30 కిక్ (తెలుగు) - 10.30
స్క్రీన్-3	మా ఊరి రాజారెడ్డి (తెలుగు) - 10.30, ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 1.30, భూతద్దం భాస్కర్ - 4.20, 10.20, ఊరుపేరు భైరవ కోన (తెలుగు) - 7.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు) - 11.00, 1.55, 4.50, 7.45, 10.40
స్క్రీన్-2	డ్యూన్ - 2 (ఇంగ్లిష్) - 10.00 చారి 111 - 1.35, 10.10 వ్యూహం - 4.25 భూతద్దం భాస్కర్ (తెలుగు) - 7.10
స్క్రీన్-3	భూతద్దం భాస్కర్ (తెలుగు) - 12.10, డ్యూన్-2 (ఇంగ్లిష్) - 3.10, 6.40, 10.10
స్క్రీన్-4	ఇంటి నెం.13 (తెలుగు)-1.05, కిక్ - 3.50, ఆర్టికల్ 370 (హిందీ) 7.15
దేవి	ఆపరేషన్ వాలెంటైన్ (తెలుగు)
నటరాజ్	ఇంటి నెం. 13 (హిందీ)
లలితామహల్	సమరసింహా రెడ్డి - 11.00, 9.15 కిక్ (తెలుగు) - 2.15, 6.00
విజయ్	ఊరు పేరు భైరవకోన (తెలుగు)